క్లుప్తంగా

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని ఆయా ఉద్యోగుల సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. ఈమేరకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాంను హైదరాబాద్‌లో ఆదివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. సుమారు 25 ఏళ్లకుపైగా యూనివర్సిటీలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమను క్రమబద్ధీకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆయా కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ బాధ్యులు డాక్టర్ విష్ణువర్దన్, రాయికంటి సురేష్‌కుమార్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, నాగుల శివప్రసాద్, దయాకర్, డాక్టర్ సుదయ్య, సంగాల రాజమౌళి ఉన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో తెలుగు సంవత్సరాది -2024 పంచాంగాన్ని గురు మధనానంద సరస్వతి పీఠం ఆస్థాన పీఠాధిపతి మధవానంద సరస్వతి ఆదివారం ఆవిష్కరించారు. ఇటీవల శివైక్యం పొందిన అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి రూపొందించిన పంచాంగాన్ని ఆశ్రమ పెద్దలతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో మధుసూదనానంద సరస్వతి, పీఠం ఆస్థాన నిర్వాహకులు పార్నంది రఘురామ వర్మ, ప్రసాద్‌శర్మ, అయినవోలు సాయికృష్ణ శర్మ, రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖిలా వరంగల్: రౌడీషీటర్లు భూ కబ్జాలు, గొడవల్లో తలదూర్చొద్దని, సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ ఆదేశాల మేరకు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, భూ తగాదాలు, కబ్జాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుటుంబంతో కలిసి ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మున్నీరుల్లా, గోవర్ధన్, పోలీసుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గం వైపు నడిపించే వారే గురువులు



విద్యారణ్యపురి: సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించే వారే నిజమైన గురువులు అని, ఆ కోవకు చెందిన వారిలో ఆముదాల దాత మహర్షి ముందు వరుసలో ఉంటారని సామాజిక సామరసత వేదిక రాష్ట్ర కన్వీనర్, అఖిల భారత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ ప్రశంసించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) గౌరవ అధ్యక్షుడు, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాత మహర్షి ఉద్యోగ విరమణ సందర్భంగా హనుమకొండలోని సామ జగన్మోహన్ స్మారక భవనంలో ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నవాత్ సురేష్, సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర సహ కార్యదర్శి చంద్రకాంత్ రెడ్డి, విద్యాభారతి దక్షిణ క్షేత్ర శిక్షణ్ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బీ.రాధ, ఎంఈఓ రాంకిషన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను అరికట్టాలి

శాయంపేట: మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని మైదాం కుంటలో అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలను అరికట్టాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పెద్దకోడెపాక గ్రామంలోని మైదాం కుంటలో ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇచ్చారంటూ ఓ కాంట్రాక్టర్ చలివాగు ప్రాజెక్టు కట్ట మరమ్మతు కోసం ఇష్టానుసారంగా 10 ఫీట్ల మేర తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు.

తీవ్రమవుతున్న నీటి ఎద్దడి

- ఇబ్బందులు పడుతున్న ఎగువ ప్రాంత ప్రజలు
- దృష్టి సారించని అధికారులు



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ఏఆర్ఆర్‌నగర్ వాసులు



కాజీపేట చౌరస్తాలో లీకవుతున్న పైపులైన్

కాజీపేట: కాజీపేట పట్టణంలో తాగునీటి ఎద్దడి నానాటికి తీవ్రమవుతోంది. ఇటీవలి కాలం వరకు రెండు, మూడు రోజులకోమారు నల్లాల ద్వారా వచ్చే తాగునీరు ప్రస్తుతం నాలుగైదు రోజులకోసారి వస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారుతోందని వాపోతున్నారు.

రూ.కోట్లు ఖర్చు చేసినా..

రోజురోజుకు తాగునీటి తీవ్రత ఎక్కువ అవుతుండడంతో ఎండలు మరింతగా ముదిరితే పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా వడ్డేపల్లి రిజర్వాయర్‌ను వివిధ కారణాలతో అటకెక్కించారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి కాజీపేట పట్టణానికి తాగునీటిని కార్పొరేషన్ అధికారులు సరఫరా చేస్తున్నారు. రూ.కోట్లలో నిధులు ఖర్చుచేస్తూ ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నేరుగా నీటిని గ్రావిటీ ద్వారా తీసుకుని ఫిల్టర్ చేసి విష్ణుపురి, డీజిల్‌కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి తాగునీటిని పట్టణ ప్రజలకు అందిస్తున్నారు. అలాగే, అనేక ప్రాంతాలకు రూ.లక్షల వ్యయం చేస్తూ ట్యాంకర్లను అద్దెకు తీసుకుని కాలనీలకు తాగునీరు అందిస్తున్నారు.

పైపులైన్లు, లీకేజీలే కారణం

ఎప్పుడో వేసిన పైపులైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. భారీ వాహనాల రాకపోకలతో భూమిలో వేసిన పైపులైన్లు పగిలిపోయి తాగునీరు వృథాగా రోడ్డు పాలవుతోంది.



ఇంపీరియల్ కాలనీలో లీకవుతున్న ఎయిర్ వాల్వ్

మున్సిపల్ అధికారులు లీకేజీలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నా సమస్య తీవ్రత తగ్గకపోగా మళ్లీ మొదటికే వస్తోంది. గేట్‌వాల్వ్‌లు నిత్యం ఎక్కడో ఒక్కచోట లీకవుతూనే ఉన్నాయి. దీంతో ఎగువ ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ప్రత్యామ్నాయ చర్యలేవి?

వేసవి ఆరంభంలోనే కాజీపేట వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఎదురైన చేదు ఫలితాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గ ప్రతినిధులు పట్టణంలో అడుగడుగునా ఉన్న పైపులైన్ల లీకేజీలను యుద్ధ ప్రతిపాదికన ప్రత్యేక సిబ్బందితో నివారణ చర్యలు చేపట్టాలి. పట్టణానికి తాగునీటిని అందించే ఫిల్టర్‌బెడ్ వద్ద విపత్కర పరిస్థితుల్లో ఉపయోగపడేలా ఎప్పుడూ అదనపు విద్యుత్ మోటార్లను సిద్ధంగా ఉంచాలి. గేట్‌వాల్వ్‌ల లీకేజీలను అరికట్టాలి. సిబ్బంది ఎప్పటికప్పుడు లీకేజీలను గుర్తించేలా చర్యలు చేపడితే ట్యాంకర్ల ద్వారా నీటిని కాలనీలకు సరఫరా చేయాల్సిన అవసరమే ఉండదని స్థానికులు చెబుతున్నారు. ముందస్తు చర్యలు చేపట్టాలని, సమస్య వచ్చాక ఉరుకులు, పరుగులు తీయడం సరికాదంటున్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి..



ఈవేసవి కాలంలో ఏ కాలనీలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. వేసవి కాలం ముగిసే వరకు రెండు రోజులకోమారు తాగునీరు సరఫరా జరిగేలా చూడాలి.

- అంకేశ్వరపు కుమారస్వామి, కాజీపేట

నగరంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు



కాజీపేటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్

కాజీపేట: ప్రజల పాప పరిహారార్థం జేరుసాలెం రాజ భటులతో శిక్షలు అనుభవించి అసువులు బాసిన ఏసుప్రభువు.. మూడు రోజుల అనంతరం పునరుత్థానుడైన రోజుకు గుర్తుగా క్రిస్టియన్లు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. కాజీపేట పట్టణంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం కనులపండువగా జరుపుకున్నారు. తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ పి.విక్టర్‌బాబురాజ్, సెయింట్ జోసఫ్ చర్చి ఫాదర్ బాల్‌రెడ్డి, అల్ఫా ఓమెగా చర్చిలో బిషప్‌జాన్ మార్కండేయ, సీఎస్ఐ జోహార్ పాల్, రివైవల్ చర్చిలో బ్రదర్ కురియన్, అయ్యల దానం తదితరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు ధర్మసాగర్‌లోని కల్వరి కొండజాతరకు బయలుదేరి వెళ్లారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: నగరంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రిస్టియన్ కాలనీ సీబీసీ చర్చి, గాంధీనగర్‌లోని అసిస్సి చర్చి, లక్ష్మీపురంలోని బెతెస్థ బాప్టిస్ట్ చర్చి, ఇతర చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుప్పాలగుట్ట కొండపై సీబీసీ చర్చి పాస్టర్ డాక్టర్ పుల్లా జగ్జీవన్ బాబ్జి ప్రార్థనలు చేసి క్రీస్తు సందేశం అందించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నాయకులు పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

ఖిలా వరంగల్: శాంతి భద్రతల పరిరక్షణకే తమ ధ్యేయమని వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఏకశిల కొండపై ప్రార్థనలు చేసేందుకు క్రైస్తవులకు అనుమతి లేదని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని ఏసీపీ సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్ పార్కులోని ఏకశిల కొండపై మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలీసుల బందోబస్తును ఏసీపీ నందిరామ్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో ఎవరూ మతకలహాలు సృష్టించవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బందోబస్తులో ఎస్సై గోవర్దన్, మున్నీరుల్లా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బందోబస్తును పరిశీలిస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపండి



మాట్లాడుతున్న అరూరి రమేష్

కరీమాబాద్: వర్ధన్నపేట నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలు.. ఇప్పుడు తనను ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించాలని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కోరారు. గ్రేటర్ పరిధిలోని మామునూరు మీఎస్‌పీ ఫంక్షన్‌హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఉన్న వర్ధన్నపేటను మున్సిపాలిటీగా చేయడమే కాకుండా గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధి లైట్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధిలో కూడా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలకంగా నిలిచిందని పేర్కొన్నారు. పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి బీజేపీ పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, పార్టీ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాజయ్యయాదవ్, కుమారస్వామి, కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీరాములు, సునీత, అనిత, రంజిత్, వనంరెడ్డి, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

గీసుకొండ : గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా మిత్తింటి సురేందర్, కార్యదర్శిగా బొల్లం మధు, కోశాధికారిగా టి. కమలాకర్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా కొడకండ్ల భద్రయ్య, కార్యదర్శిగా వజినేపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా పుల్లూరి రమేశ్ ఎన్నికయ్యారు. పురుషుల పరపతి సంఘం అధ్యక్షుడిగా దొడ్డ బాబూరావు, కార్యదర్శిగా అయిత ప్రవీణ్, కోశాధికారిగా తాటికొండ వీరభద్రయ్య, మహిళా పరపతి సంఘం అధ్యక్షురాలిగా పిపిరిశెట్టి లక్ష్మి, కార్యదర్శిగా కొడకండ్ల వరలక్ష్మి, కోశాధికారిగా పి.స్వరూప ఎన్నిన్నారు.

41వ సారి రక్తదానం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు అమ్మ అశోక్ ఆదివారం 41వ సారి రక్తదానం చేశారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన కలవాల సతీష్‌కు సర్జరీ నిమిత్తం రక్తం అవసరం ఉండగా రక్తదానం చేసేందుకు అశోక్ ముందుకు వచ్చారు.

వడుప్సా వరంగల్ డివిజన్ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కార్పొరేటర్ జన్ను షీభారాణి

వరంగల్: వడుప్సా (ట్రస్మా) వరంగల్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరంలోని నలంద ఉన్నత పాఠశాలలో వడుప్సా వరంగల్ డివిజన్ సమావేశాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రావు, రాష్ట్ర సలహాదారులు కొమ్మినేని భూపాల్‌రావు, కరస్పాండెంట్ షణ్ముకాచారి, 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీభారాణి పాల్గొన్నారు. వడుప్సా వరంగల్ డివిజన్ అధ్యక్షుడిగా బొల్లం కనకయ్య, కార్యదర్శిగా జన్ను విలియమ్స్, కోశాధికారిగా బలవారి సుధీర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజు, ముఖ్య సలహాదారులుగా ఎస్.సుధాకర్, సలహాదారులుగా వై.విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శిగా ఎండి.నజీర్, ఎండి.ఉస్మాన్, ఆర్.అశోక్, మాధవి, ఖలీల్, సురేందర్‌తో పాటు ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షీభారాణి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఫీజులో రాయితీలో ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామమూర్తి, చంద్రారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడి విగ్రహం ఊరేగింపు



విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ ప్రతినిధులు



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట గణేశ్‌నగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాలను ఆదివారం ఊరేగించారు. మహిళలు మంగళహారులతో విగ్రహానికి ఎదురేగి, వాహనం ఎదుట నీళ్లు ఆరగించి కొబ్బరికాయలు కొట్టారు. సాయంత్రం అభయాంజనేయ స్వామి విగ్రహానికి సలాభిషేకం, ధాన్యాభిషేకం నిర్వహించారు. వేద పండితుడు వేణునాథాచార్యుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, పంచసూక్త హవనాలు, హోమం, పూర్ణాహుతి, శాస్త్రోక్తంగా కుంకుమ పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో నెల్లూరి శ్రీనివాసరావు, సుతారి రాజు, చిన్నాల రాధాకిషన్, విజయ్, సారంగం, రవీందర్, రవిబాబు, అశోక్, రాకేష్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, సోమయ్య, కిరణ్, సుమన్, రాకేష్, సంతోష్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

నేడు గౌరీశంకర దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలో నూతనంగా నిర్మించిన గౌరీశంకర దేవాలయంలో శివపార్వతులు, గణేశ్, దుర్గ, సాయిబాబా, ఆంజనేయ స్వామి, అయ్యప్పస్వామి, నవగ్రహ నాగేశ్వరస్వామి సహిత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9.17 గంటలకు యంత్ర విగ్రహమూర్తుల ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయని చెప్పారు. ఆదివారం హోమం, కుంకుమార్చనలు నిర్వహించినట్లు వివరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, తదితరులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, బీఆర్‌ఎస్ డివిజన్ యూత్ అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖిలా వరంగల్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్‌లో పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు కోడం సురేందర్ అధ్యక్షతన వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మల్లేశం, రవి మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌ఫోన్ల వినియోగంతో లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం జబర్దస్త్ ఫేమ్ శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడం సబిత, కరస్పాండెంట్ శ్రీధర్, వడుప్సా ప్రతినిధులు సాంబమూర్తి, వీరస్వామి, బిల్లా రవి, టి.జ్ఞానేశ్వర్, సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించుకున్న కాలనీవాసులు

వర్ధన్నపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులే రెండు వార్డులను కలుపుకుని వీధిలో కల్వర్టు నిర్మించుకున్నారు. పట్టణంలోని ఒకటవ, రెండవ వార్డులను కలుపుకునే వీధిలోని డ్రెయినేజీపై ఉన్న కల్వర్టు ధ్వంసం కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో కాలనీవాసులు ముందుకువచ్చి చందాలు వేసుకుని కల్వర్టును నిర్మించుకున్నారు.

సమస్యల చట్రంలో 54వ డివిజన్

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



డివిజన్‌లో మురుగునీటితో నిండిన కచ్చా కాల్వ

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంట, శ్మశానవాటిక ప్రాంతం, డబ్బాలరోడ్డు, పెద్ద మోరీ పక్క ప్రాంతాల్లో సమస్యలు తిష్ట వేశాయి. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఆయా ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

సమస్యలతో సతమతం

అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ తయారైంది. దాంతో నిత్యం సమస్యలతో ప్రజలు సహవాసం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం, దోమల కారణంగా రోగాల బారిన పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో అడవిని తలపించే తుమ్మ, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చెత్తా చెదారం పేరుకుపోవడంతో ఇళ్లల్లోకి విషపు పురుగులు సంచరిస్తున్నాయి.

దుర్వాసనతో ఇక్కట్లు

మురుగునీటి కాల్వల్లో మురుగు పేరుకుపోవడంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. డివిజన్‌ను ఆనుకొని ఉన్న జంతు వధశాలల నుంచి వ్యర్థాలను పెద్ద మోరీలోకి వదిలేయడంతో కుక్కలు బెడద అధికమైంది. వ్యర్థాలను తింటూ అవి ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. వాహనదారులు, బాటసారులపై దాడులు చేస్తున్నాయి. ఆహ్లాదకర వాతావరణానికి డివిజన్‌లో ఒక పార్కు కూడా లేదని ప్రజలు వాపోతున్నారు.

సమస్యలతో సతమతమవుతున్నాం..

డివిజన్‌లో నెలకొన్న సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాల్వల్లో మురుగునీరు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. మురుగు నిల్వతో దోమల బెడద అధికమై వ్యాధుల బారిన పడుతున్నాం. అలాగే, కుక్కల బెడద కూడా అధికంగా ఉంది.

- సూరమ్మ, స్థానికురాలు

ఎవరూ పట్టించుకోవడం లేదు

కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదు. చెత్తాచెదారం పేరుకుపోయినా తొలగించే వారు లేదు. దోమలు, ఈగలతో అనేక అవస్థలు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మా సమస్యలను పరిష్కరించాలి.

- రాములు, స్థానికుడు



రోడ్డు పక్కన కాల్చిన వ్యర్థాలు



చెట్లు లేక మైదానంగా మారిన పార్కు



జనావాసాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు

'రేవూరి'ని విమర్శిస్తే గుణపాఠం తప్పదు

పరకాల: నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని విమర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రజలు తరిమికొట్టడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి భిక్షపతి మాట్లాడారు. ఏడు సార్లు పోటీ చేసి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని నర్సంపేటను అభివృద్ధి పథంలో నడిపించి నేడు పరకాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రకాశ్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. నిధుల మంజూరు లేకుండానే అభివృద్ధి పనుల పేరిటా మాయమాటలు చెప్పిన చల్లా ధర్మారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. నిధులు ఉంటే పరకాల చలివాగు చెక్‌డ్యాం, కంఠాత్మకూర్ వంతెనలు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు.